మరో వీధి పాప

గోడ మీది చిన్న అద్దం ముక్కలో తన ముఖం చూసుకున్నది కామాక్షి. చేతి గోళ్లతో వెంట్రుకలు సర్దుకున్నది. అంతలోనే అనవసరంగా పళ్లు బైటపెట్టి తన ప్రతిబింబాన్ని తనే వెక్కిరించింది. తరువాత రంగువెలిసిన పాత చీరె కుచ్చెళ్లను దులుపుకుని ఇవతలికి వచ్చింది. ఆ చీరెను కామాక్షి ఎప్పుడో తప్ప కట్టుకోదు. వీధి మొదట్లో ఉన్న కల్యాణ మండపంలో ఏదైనా పెళ్లికి వెళ్లినప్పుడూ లేక ఆ వీధిలోని ఏ యింటిలోనైనా ఏదైనా శుభకార్యం జరిగినప్పుడు మాత్రమే దాన్ని విరిగిపోయిన పాత చెక్కపెట్టలో నుంచి ఇవతలకి తీసి ధరిస్తుంది. ఆ చీరెకో చరిత్ర ఉంది. రెండుమూడు సంవత్సరాల క్రిందట ఎప్పుడో ఒకసారి వీధి చివర నది కట్టక్రింద ఉన్న సత్రంలో ఎక్కడివారో వచ్చి తమ వారెవరికో కర్మాంతరాలు నిర్వహించి వెళ్లే సందర్భంలో వారిలో ఎవరో వెళ్లిపోయేటప్పుడు అన్ని సర్దుకుని 'ఇక ఇది ఎంతమాత్రమూ పనికిరాదు' అని ఒక మూలకు విసిరిపారేసిన బాపతు అది. అప్పుడు కామాక్షి అచుట్టుపక్కలనే అటూ యిటూ తిరుగుతూ ఉండి వారు వెళ్లిపోగానే ఆ రంగు వెలిసిన పాత చీరెను అత్యంత ఆప్యాయంగా తెచ్చి దాచి ఉంచుకున్నదిన్నాళ్లు.

ఆ వీధి మొదట్లో ఒక కల్యాణ మండపమూ, వీధి చివర నదికి ఖచ్చితంగా ఒడ్డునే ఉన్నా కర్మాంతరాలకోసం లేక అపర కర్మల నిమిత్తం ఒక సత్రమూ ఉండటం వల్ల కామక్షికి లాభమే. అటు యిటు ఏదో ఒక వైపు దాదాపు నెలలో మూడు వారాలపాటు తిండికి లోపం ఉండదు. కళ్యాణమండపానికి వెళ్లి పెళ్లి సందడిలో చొరబడినా, ఇటు సత్రంలో భోజనాల వేళకు ఆడవారి పంక్తిలో ఒక మూలకూర్చున్నా దాని మొహం చూసి 'పరాయి మనిషి' అని 'తమలో ఒకతె కాద'నీ తెలిసినా ఎవరూ అట్టే పట్టించుకునే వారు కారు ఎప్పుడో తప్ప. ఒక్కొక్కప్పుడు మాత్రం కామాక్షి దురదృష్టం కొద్దీ కొందరు దుష్టులు 'ఎవరీ అమ్మాయి?' అని ఆరాతీసి తరిమివేయడమూ కద్దు. అటువంటి సందర్భాలలో కామాక్షి ఏ మాత్రమూ జంకు గొంకు లేకుండా లేచి వచ్చేస్తుంది. అంతేతప్ప అన్నం పెట్టమని బతిమాలడం, ప్రాధేయపడటం వంటివి చేయదు. దర్జాగా లేచి వచ్చి నది కట్టపక్కనే ఉన్న తన గోనెసంచుల వసారాలో అభోజనంగానే పడుకుని ఉండిపోయేది కాసిని నీళ్లతో కడుపునింపుకుని. నీళ్లకు కరువు లేదు కదామరి! కామాక్షి వీధి పాప. దాన్ని ఎవరూ ఆదరించరు. కనీసం పలుకరించరు. మరి మిద్దె ఇంటి నరసింగయ్యగారికైతే కామాక్షిని చూస్తే ఎందుకో వొళ్లుమంట. అసలు అది ఎదురుపడితేనే వెంటబడి మరీ తరుముతాడు. ఆ పిల్ల ఆ పేట మొత్తానికే కాక నగరం మొత్తానికీ, ఆ మాట కొస్తే

దేశం మొత్తానికి పట్టిన శని అని ఆయన దృఢమైన అభిప్రాయం. ఆయన ఆ పిల్ల పుట్టు పుర్వోత్తరాలు తెలిసిన నలుగురైదుగురిలో ఒకడు. ఆ రహస్యం తెలిసిన వారిలో ఒక ముసలమ్మ మరో పెద్దాయనా ఇటీవలే పోయారు. అవతలి వీధిలో కమలమ్మ మాత్రం కామాక్షిని కాస్త దయతో సానుభూతితో చూస్తుంటుంది. తమ ఇంటికి అప్పుడప్పుడు రానిస్తుంది. తన పిల్లలతో కూర్చుని సాయంవేళల టీవీ చూడనిస్తుంది. ఎప్పుడన్నా కామాక్షి అటు వెడితే ప్రేమగానే పలుకరించి ఇంట్లో ఉన్నదేదో తినబెడుతుంది కూడా. అయితే కామాక్షి ఈ మధ్య కొద్ది రోజులుగా అటు వెళ్లడం తగ్గించింది. అటు వెళ్లడానికి భయపడుతున్నది కూడా.

ఇటీవల ఒకనాటి మధ్యాహ్నం - అప్పటికి కామాక్షి తిండితిని రెండు రోజులయింది - ఆకలితో కమలమ్మగారి యింటికి వెళితే ఆమె "పిచ్చికుంకా! అట్లా కడుపు మాడ్చుకోగూడదు. తిండి దొరక్కపోతే మాయింటికి రా..." అంటూ విస్తరిలో ఇంత అన్నం తినబెట్టి అంతలోనే అనుమానపు చూపులతో కామాక్షిని గుచ్చిగుచ్చిచూస్తూ ఏమైందే నీకు? అని అడిగింది అకస్మాత్తుగా. కామాక్షి భయంభయంగా కళ్లు పెద్దవి చేసి చూసిందే తప్ప బదులు పలకలేదు.

కమలమ్మకు అనుమానం వచ్చింది. "ఈ పిల్లకుంకేమీ కాలేదు కదా! చూడబోతే ఏదో జరిగినట్టే ఉంది" అనుకుంది కూడా.

కామాక్షి ముఖంలో ఆ పెద్ద పెద్ద తెల్లని కళ్లు తప్ప మిగిలినవన్నీ - ముక్కు చెవులు నోరు అన్నీ - ఎవరెవరివో ఎక్కడెక్కడివో తెచ్చి అతికించినట్టు ఉంటాయి. సృష్టికర్త చాలా ఆకృతులు తయారుచేసి చివరకు మిగిలిపోయిన ముక్కు నోరు చెవులూ ఊరికేపారేయడం ఎందుకులే అని అతికించి జీవంపోసినట్టు... చిత్రంగా ఉంటాయి. మాట సంగతి సరేసరి.. నంగి నంగిగా... దాదాపు పధ్నాలుగు పదిహేను సంవత్సరాల క్రిందట ఎప్పుడో ఒకనాడు నదీ తీరంలో ఎవడో బిచ్చగాడు వేసుకున్న గోనె సంచీల వసారాలోనుంచి పసిపిల్ల ఏడుపువినిపించి నదీ స్నానానికి వచ్చిన నలుగురైదుగురు తలలు తిప్పిచూశారే తప్ప ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఆ పసిగుడ్డు ఆయుష్షు గట్టిది కావడం వల్ల అది చావలేదు. కదిలింది. కాళ్లు చేతులు కొట్టుకుంది. పొర్లింది. దొర్లింది. దొరికింది తిన్నది. పాకింది. తర్వాత అడుగులు వేసింది. అక్కడా ఇక్కడా తిని పెరిగింది. ఒకప్పుడెప్పుడో పక్క వీధిలోని వీధిబడి గోడ పక్కన నిలబడి లోపలకి తొంగిచూసి అంతలోనే 'అమ్మో' అనుకున్నది. మళ్లీ అటు పోనే లేదు. దానికి కామాక్షి అనే పేరు వేరెవరో పెట్టలేదు. అదే పెట్టుకుంది. వీధిచివరి కళ్యాణమండపంలో ఒక పెళ్లి సందర్భంగా దాని అనాకారాన్ని చూసి ఎవరో ముచ్చటపడి 'నీపేరేమిటే?' అని అడిగితే అది ఉన్నట్టుండి 'కామాక్షి' అని చెప్పేసింది. అప్పటి నుంచీ అది ఆ పేరుతోనే ఆ నాలుగు వీధులలో ప్రసిద్ధికెక్కింది. ఆ పేట దాటితే ఏముందో ఆ పిల్లకు తెలియనే తెలియదు.

ఆ చిన్న గోనె సంచుల వసారా జోలికి ఎవరూ వెళ్లరు. కట్ట ఎక్కి పైకి వెళితే కళ్లముందు మహానది... అపార జలరాశి... ఒక వైపు రైలు వంతెన... మరోవైపు దూరంగా నది మీద రోడ్డు బ్రిడ్జి....

కామాక్షి తెలతెలవారుతూ ఉండగానే లేచి వెళ్లి నదిలో మునకలు వేసి వస్తుంది. ఆ నది కొన్నాళ్ళు శుష్కించి కృశించిపోయి ఉంటుంది. మరికొన్నాళ్లు భీకరఘోష పెడుతూ ఉరుకులు పరుగులతో భయంకరంగా ప్రవహిస్తుంది.

కామాక్షికి శత్రువు ఒకడున్నాడు. వాడొక పురోహితుడి కొడుకు. పరమ దండగ మారి బ్రతుకువాడిది. వొట్టి భటాచోరుగాడు. వాడొకసారి వెకిలిగా నవ్వుతూ నది గట్టుమీద కూర్చుని ఉన్న కామాక్షి చెయ్యి పట్టుకున్నాడు. అప్పుడా పిల్ల ఏమీ అనలేదు. దాంతో వాడు కొంచెం ముందుకు జరిగాడు. గుండెల మీద చెయ్యి వేయబోయాడు. కామాక్షికి అప్పుడు వొళ్లు జలదరించింది. పాము వంటిదేదో గుండెల మీద పడబోతున్నట్టనిపించి విసిరికొట్టి లేచి వెళ్లిపోయింది. వాడెప్పుడయినా ఎదురుపడితే మాత్రం కామాక్షికి కడుపులో దేవినట్టయి తన వికారపు ముఖాన్ని మరింత వికృతంగా చేసుకుని తప్పుకుని వెళ్లిపోయేది. వాడు ఏమనుకున్నాడో ఏమో దాని జోలికెన్నడు రాలేదు మళ్లీ.

ఇప్పుడు కామాక్షికి తనలో వస్తున్న మార్పేదో తెలియడం మొదలైంది. కమలమ్మ ప్రశ్నలువిన్నప్పటి నుంచీ దాని మనసులో దిగులు, భయం, ఆందోళన ముప్పిరిగొన్నాయి. రోజులు గడిచేకొద్దీ వొళ్లు బరువెక్కుతున్నట్టు అనిపించింది. ఏమీ తినబుద్ధి అయ్యేది కాదు. ఎప్పుడైనా కక్కుర్తిపడి కాస్త ఎంగిలి పడినా వెంటనే వాంతి వచ్చి అంతా వెళ్లిపోయేది.

ఇప్పుడు గంటల తరబడి నది ఒడ్డున ఒంటరిగా కూర్చుంటుంది. ఎదురుగా రంగులు కమ్మిన ఆకాశం వంక, ఎగిరే పక్షుల వంక, దూరంగా కొండల వంక చూస్తూ ఉండిపోయేది. క్రమంగా రోజులు గడిచేకొద్దీ తిరుగుడు తగ్గించింది. నలుగురి కళ్లలో పడకుండా తనలోతనే ముడుచుకుని తిరిగే నల్లత్రాచు వలె జనదృష్టిని తప్పించుకుని తిరిగేది.

ఏదో అనుమానం... ఒకనాడెప్పుడో... అర్థరాత్రివేళ... జోరుగా వర్షం పడుతుండగా తాను గాఢ నిద్రలో ఉండగా పైన ఏదో బరువు... మెత్తని బరువు... తాను తోసివేయలేదు... చలికి వొణుకుతూ మూలిగింది... అంతే ఏం జరిగిందో తెలియనే లేదు. తర్వాత పై నుంచి వర్షం చినుకులు పడి మెలకువ వచ్చింది. ఎందుకో అసహ్యం అనిపించి గబగబ వెళ్లి నదిలో మునిగి ఇవతలికి వచ్చింది. ఇదంతా బహుశా ఏదో కలవంటిది అయి ఉంటుందనుకున్నదంతే...

ఇప్పుడిక కామాక్షి పగలంతా కూడా కదలడం లేదెక్కడికీ. ఎప్పుడు లేచి ఎక్కడ ఏమి తింటుందో ఎవరికీ తెలియదు. 'ఈ వెర్రిపిల్ల ఏమయిందో' అని కమలమ్మ ఆరా తీయడానికి ప్రయత్నిస్తే రెండు పర్యాయాలు ఫలించలేదు.

కామాక్షి రోజులు గడిచే కొద్దీ ఆకలిని జయించింది. చలిని జయించింది. ఎండావానలను జయించింది. శారీరక బాధలను జయించింది. నిశ్చలంగా ఎదురుగా ఉన్న శూన్యాన్ని చూస్తూ గడపడం ప్రారంభించింది. రాత్రి వేళల నది గట్టుమీద కూలబడి గంటలకొద్దీ తపస్సు చేస్తున్న దానివలె గడిపింది.

ఆనాడు సాయంకాలం లోలోపల ఏదో కదలిక... సన్నగా కోస్తున్నట్టు... చాలా సేపు చిన్న చిన్న పొదల మధ్య కూర్చుని నదిని చూసింది. ఎక్కడో దూరతీరాల నుంచి వచ్చే పెను ధ్వని తనకు తప్ప ఇతరులెవరికీ వినిపించడంలేదని అనుకున్నది. ఆ తర్వాత చిన్న కొవ్వొత్తి వెలుగులో ముందు ముడుచుకుని పడుకుంది. తర్వాత రాత్రి గడిచేకొద్దీ కాళ్లు బారజాపి పడుకుంది. రాత్రి పొద్దుపోయే వరకు బాధ అంతా భరించింది. కేకలు పెట్టలేదు. మూలుగులు పైకి వినబడనివ్వలేదు. నిశ్శబ్దంగా వేదనను ప్రకృతి పెడుతున్న హింసను ఒంటరిగా సహించింది. చాలాసేపు అలా బాధపడ్డ తర్వాత ఏళ్ల క్రిందట తాను ఒక తల్లి కడుపులో నుంచి బైటపడ్డట్టు- ఇప్పుడు తన కడుపులో నుంచి మరొక పిల్ల కటిక నేలమీద పడింది. పడిన తర్వాత పదిపదిహేను సెకండ్లు గడిచాక కీచుమని ఏడ్చింది. కామాక్షి కాళ్లు వొణుకుతుండగా లేచింది. అప్పటికప్పుడు 'అంతా మహా అసహ్యం' అనిపించి స్నానం చేయాలనుకుంది. తడబడుతున్న అడుగులతో కట్ట దిగింది. తన అంచనా ప్రకారం లోపల కొంత దూరం కేవలం ఇసుక ఉండాలి. కాని ఇప్పుడామె అంచనా తప్పింది. మెట్ల క్రిందనే నీళ్లు చల్లగా తగిలాయి. ఆ తర్వాత రెండుమూడు అడుగులు వేసేసరికే నీళ్లు పాముల గుంపువలె ఆమెను గుండెలదాకా బంధించాయి. ఆమె జారిపోయి తేలిపోయి నీళ్లలో కలిసిపోయింది.

తర్వాత చాలాసేపటికి తెలతెలవారుతుండగా గట్టు క్రింద గోనె సంచుల వసారాలో కటిక నేలమీద మరో కామాక్షి - మరో వీధి పాప - రోదిస్తూ ఉండగా కొందరెవరెవరో విన్నారు. విని ఎవరి త్రోవన వారు వెళ్లిపోయారు.

❀ ❀ ❀